

టికెట్లు అమ్ముకునే బోర్డు మాది కాదు

■ మీ కమీషన్ల పనులు ఆపామని టీటీడీపై దుష్ప్రచారం

■ సరిదిద్దుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం

: బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల తిరుపతి దేవస్థానంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగానే భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా, కూటమి ప్రభుత్వానికి, బిఆర్ నాయుడు ఆధ్వర్యంలోని బోర్డుపై బురద జల్లుతూ ప్రణాళిక బద్ధంగా కార్యక్రమాలు చేస్తున్నారని, ఇటువంటి చర్యలు పునరావృతమయితే బోర్డు నుండి కఠిన చర్యలు తీసుకునేలా సమావేశంలో చర్చిస్తామని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు వైద్యం శాంతారాం, నరేష్ కుమార్‌లు స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బోర్డు సభ్యులు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి, టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన ఏడు నెలల కాలంలో ఎన్నడూ లేని విధంగా సంతృప్తికరంగా సామాన్య మధ్యతరగతి ప్రజలకు దర్శన ఏర్పాట్లతో పాటుగా అన్న ప్రసాద వితరణ కూడా చేస్తున్నామని, ఈ కార్యక్రమాలపై ధర్మకర్తల మండలం నుండి నిర్ణయం తీసుకున్న మూడు వారాల తర్వాత కూడా బోర్డు సభ్యులు భక్తుల వద్దకు వెళ్లి నేరుగా వారిని అడిగి సంతృప్తి చెందారా లేక ఏదైనా మార్పులు చేయాలా అని విజ్ఞతతో వారి సలహాలను స్వీకరిస్తున్నామన్నారు. ఇంత పారదర్శకంగా శ్రీవారి భక్తులకు సేవలు చేస్తుంటే వైసీపీ నాయకులు టీటీడీపై బురదజల్లే కార్యక్రమాన్ని చేయడం బాధాకరమన్నారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఎంతో సంతృప్తికర సేవలు అందిస్తున్న ధర్మకర్తల మండలి బోర్డుపై వైసీపీకి చెందిన ఒక వ్యక్తి క్యూలైన్లలో చిన్నపాటి లోపానికి బోర్డుని నిందిస్తూ అధికారులను నిందిస్తూ వీడియోలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంపై ఇప్పటికే అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఇటువంటి ఘటనలపై టీటీడీ నుండి ఎటువంటి చర్యలు తీసుకోవాలో రాబోయే బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కమీషన్ల కోసం టీటీడీ నుండి కేటాయింపబడ్డ రూ.1600 కోట్ల రూపాయల పనులను తాము నిలుపుదల చేశామన్నారు. దీనిపై కక్షతోనే టీటీడీపై మాజీ చైర్మన్ ఏ చిన్నపాటి విషయాన్ని కూడా భూతద్దంలో చూపుతూ ప్రజల దృష్టిని మరల్చడానికి తహతహలాడుతుంటారన్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి ఏదైనా సలహాలు ఉంటే ఇవ్వాలని, దానిని తప్పక అమలు పరుస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో శ్రీహరి పాల్గొన్నారు.

పేదల లబ్ధికే రేషన్ షాపులు

◆ యండియు వాహనాలు రద్దు

◆ జిల్లా వ్యాప్తంగా రేషన్ సరుకులు పంపిణీ చేసిన నాయకులు, అధికారులు

రేషన్ షాపువద్ద సరుకుల పంపిణీ ప్రారంభించిన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : పేదలకు పారదర్శకంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం కోసమే చౌక ధరల దుకాణాలు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. తిరుపతిలోని పెద్దకాపు లే అవుట్ లోని 34వ రేషన్ షాప్‌ను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. అనంతరం రాఘవేంద్ర నగర్ లోని 75 వ షాప్, మాధవనగర్ లోని 74వ షాప్ లను ఎమ్మెల్యే ప్రారంభించి లబ్ధిదారులకు సరుకులను అందించారు. నగరంలో 102 చౌక ధరల దుకాణాలు ద్వారా పేదలకు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి తెలిపారు. ప్రతి నెలా ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు సరుకులను లబ్ధిదారులకు డీలర్లు అందిస్తారని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు సరుకులు అందిస్తారన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో పేదలకు వాహనాల ద్వారా రేషన్ అరకొరగా పంపిణీ చేసి మిగిలిన బియ్యాన్ని కాకినాడ, విశాఖ పోర్ట్‌ల ద్వారా అక్రమంగా విదేశాలకు తరలించి కోట్లు దండుకున్నారని ఆరోపించారు. పదహారు వందల కోట్ల రూపాయలతో యండియం వాహనాలు కొని దుబారా చేశారని విమర్శించారు. పేదలు బియ్యం, ఇతర నిత్యావసరాల కోసం ఎటువంటి ఇబ్బంది పడకూడదని సీఎం, డిప్యూటీ సీఎంలు తిరిగి చౌక ధరల దుకాణాలను తీసుకొచ్చారని ఆయన చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి వెళ్ళినా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, యువనాయకులు నారా లోకేష్‌లు నెరవేరుస్తున్నారని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర అభివృద్ధికి చేయూత అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి రాజు, ఆర్డీఓ రాంమోహన్, అర్బన్ తహశీల్దార్ భాగ్యలక్ష్మి, ఎన్డీఏ నాయకులు పులిగోరు మురళీ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్‌లు ఎస్కే బాబు, అన్నా అనితా, సింగంశెట్టి సుబ్బరాయలు, దొడ్డ రెడ్డి శ్రీనివాసలురెడ్డి, దొడ్డరెడ్డి రామకృష్ణా రెడ్డి, రాజా రెడ్డి, ఆకేపాటి సుభాషిణి, మహేష్ యాదవ్, భరణి యాదవ్, హేమంత్ కుమార్ యాదవ్, దూది శివ, బాలాజీ, సానె శ్రీనివాస్, ఆళ్వార్ మురళీ, వూసా మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

వృద్ధుల కోటాను ఇంటి వద్దే అందిస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు చౌక ధరల దుకాణం ద్వారా కార్డుదారులకు రేషన్ పంపిణీ ప్రారంభమైందని, ఖచ్చితమైన తూకంతో నాణ్యమైన సరుకులు అందించాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం స్థానిక తిరుచానూరు పంచాయతీ యోగిమల్లవరంలో నిత్యవసర సరుకులు పంపిణీ పునః ప్రారంభ కార్యక్రమం సందర్భంగా డిఎస్‌ఓ శేషాచలం రాజుతో కలిసి రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ సీఎం ఆదేశాల మేరకు జిల్లాలో కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. వికలాంగులకు, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులను 1వ తేదీన నుంచి 5 వ తేదీ వరకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటలలోపు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోఏ ఎస్ ఓ జయరాజ్, తాసిల్దార్ రామాంజనేయులు, డీలర్ రాజు కార్డుదారులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లాడిపై కూడా సైకోయిజమా?

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉమేష్ రావు, టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడి వివాహ వేడుక సందర్భంగా ఇబ్రహీంపట్నంలో అటుగా సైకిల్ తొక్కుకుంటూ వెళుతున్న పిల్లాడిపై వైసీపీ శ్రేణులు అనుచితంగా ప్రవర్తించడం సిగ్గుచేటని టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు విమర్శించారు. తన సైకిల్ పాడుచేయవద్దని చిన్నపిల్లాడు ఏడుస్తూ వేడుకున్నా ఆ మూక ఆగకుండా పిల్లాడి సైకిల్‌ను అతని కళ్ళ ముందే కసిగా తొక్కడం చూస్తే, వైసిపి వారికి మానసిక చికిత్స అత్యవసరంగా అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అన్నెం, పున్నెం ఎరుగని పసి పిల్లాడిని భయభ్రాంతులకు గురి చేసి, అతనిపై అత్యంత పాశవికంగా దాడి చేయడమే కాకుండా అతని మనసు గాయ పడటానికి కారణమైన వారికి చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జెవివి సభ్యత్వ చేరికపై ప్రచారం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జన విజ్ఞాన వేదిక సభ్యత్వ చేరిక ప్రచారాన్ని రాష్ట్ర వ్యాప్తంగా జూన్ ఒకటవ తేదీనుండి ప్రారంభించినట్లు జెవివి తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకర రెడ్డెప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సభ్యత్వ ప్రచార గోడ పత్రిక విడుదల చేసారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జెవివి రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు మురళీధర్ హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్లు, టీచర్లు, ప్రొఫెసర్లు, లాయర్లు, వివిధ రంగాల నిపుణులు, విద్యార్థులు, యువత, మహిళలు, మేధావులు జెవివిలో సభ్యులుగా చేరి శాస్త్రీయ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ప్రముఖ రచయిత్రి, శంకరంబాడీ సుందరాచారి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మస్తానమ్మ మాట్లాడుతూ నేటి సైన్స్ అండ్ టెక్నాలజీ యుగంలో ప్రజలు మూఢ విశ్వాసాలు పాటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు శాస్త్రీయ ఆలోచనలతో జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో జెవివి కార్య కర్తలు బిర్లా నాయుడు, లక్ష్మి నారాయణ, రఫీ, ఇమామ్, సభ్యులు జయ చంద్ర, బాలాజీ, నాగార్జున, ముకేశ్, ముని రాజ, నారాయణ, ప్రసున పాల్గొన్నారు. అనంతరం కొందరిని సభ్యులగా చేర్పించారు.

సోనుసూద్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - నాయుడుపేట: ప్రముఖనటుడు, గొప్ప ఉదారస్వభావి, సమాజ సేవకుడు, ఎంతోమందికి ఆదర్శప్రాయంగా నిలిచిన సినీ నటుడు సోనుసూద్‌ను ఆదివారం ఉదయం రేణిగుంట ఎయిర్పోర్టులో నాయుడుపేట యువ నాయకులు నెలవల రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అయనకు జ్ఞాపికను అందజేసి, శాలువాలతో పూలమాలలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉన్న ప్రత్యేకతలు తెలియజేసి సూళ్లూరుపేట పట్టణంలో ప్రముఖ ఆలయమైన చెంగాలమ్మ ఆలయాన్ని, వేనాడు దర్గాని, షార్‌ను అలాగే సుళ్ళూరుపేట నియోజకవర్గాన్ని సందర్శించాలని ఆహ్వానించారు. ఆయన సేవలు సూళ్లూరుపేట నియోజకవర్గం ప్రజలకు కూడా ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

సినీ నటుడు సోను సూద్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఆహ్వానం పలుకుతున్న నెలవల రాజేష్, 786 రఫీ

న్యాయం చేయండి సార్ : ఉచిత సేవకులు



ఎస్‌సివి నాయుడుకు ఉచిత సేవకుల వినతి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో 2014 నుంచి ఉచిత సేవకులుగా పనిచేస్తున్న 12 మందికి వేతనాలు ఇవ్వకుండా ఆలయ అధికారులు అన్యాయం చేస్తున్నారంటూ సదరు ఉచిత సేవకులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడుకు విన్నవించారు. న్యాయపోరాటం చేస్తున్న తమకు అండగా నిల వాలని కోరారు. గత ట్రస్ట్ బోర్డు 12 మంది ఉచిత సేవకులకు వేతనాలు ఇవ్వాలని దేవదాయ శాఖకు విన్నవించడంతో, అందుకు ఆమోదం తెలుపుతూ కమిషనర్ జీవో జారీ చేశారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమను పక్కనపెట్టి, కొత్తవారిని విధుల్లోకి తీసుకున్నారు అంటూ వాపోయారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

ఎన్‌ఈపి 2020 లక్ష్యాలను సాధించేలా

వర్సిటీలకు 'నీయట్' చేయూత

■ నెక్ట్‌వేవ్ అండ్ నీయట్ కో ఫౌండర్, సీఈవో రాహుల్ అత్తులూరి

- విద్యార్థులకు చక్కటి కెరియర్ ఫలితాలు
- యూనివర్సిటీలు కరికులం మెరుగు
- ఫ్యాకల్టీకి చక్కటి శిక్షణ

ప్రజాశక్తి - రుపతి సిటీ : నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (నెప్పి) 2020 మార్గదర్శకత్వంలో భారతదేశ విద్యా వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ మార్పులో యూజీసీ, ఐసీటీ సంస్థలు విద్యను, నైపుణ్యానికి పెద్దపీట వేసేలా మార్చేందుకు ఎంతగానో కృషి చేస్తూ, అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఈ ఆశయాన్ని వేగంగా ముందుకు తీసుకు వెళ్లడానికి నెక్ట్‌వేవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్డ్ టెక్నాలజీస్ (నీయట్) ప్రారంభించిన యూనివర్సిటీ భాగస్వామ్య మోడల్‌ని, దేశంలోని పలు యూజీసీ అప్రూవ్డ్ యూనివర్సిటీలు అమలు పరుస్తున్నాయి అని నెక్ట్‌వేవ్ అండ్ నీయట్ కో ఫౌండర్, సీఈవో రాహుల్ అత్తులూరి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం అయన విలేకరులతో మాట్లాడుతూ నైపుణ్య ఆధారిత విద్యకు దేశవ్యాప్తంగా అనుకరించదగినదిగా ఈ మోడల్ స్ఫూర్తిదాయకంగా నిలిచిందని తెలిపారు. విద్యార్థులకు చక్కటి కెరియర్ ఫలితాలు తీసుకువచ్చేలా యూనివర్సిటీలను బలపరచడమే ఈ భాగస్వామ్యం లక్ష్యం అన్నారు. ఒకవైపు యూనివర్సిటీ అకడమిక్ ప్రోగ్రామ్‌ను తమదైన విధంగా కొనసాగిస్తుందని తెలిపారు. మరోవైపు విద్యార్థులు ఇండస్ట్రీకి సిద్ధమవ్వడానికి అవసరమైన ప్రతిదీ హ్యాండ్స్-ఆన్ స్కిల్ ట్రైనింగ్, ఇండస్ట్రీ ప్రాక్టీషనర్ల నుంచి సెషన్స్, ఫ్యాకల్టీ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్స్, ప్లేస్మెంట్స్ ఇలా కావలసిన అన్నింటిలో నీయట్ తోడ్పాటునందిస్తుందని తెలిపారు. ఈ భాగస్వామ్యంలో యూనివర్సిటీల కరికులంని మెరుగుపరచడానికి నీయట్ ఇన్‌సైట్స్ ఇవ్వడం ఒక కీలకమైన అంశమని, ఈ ఇన్‌సైట్స్‌ని 3,000కి పైగా కార్పొరేట్ కంపెనీలు, 10,000కి పైగా టెక్ ప్రొఫెషనల్స్ కమ్యూనిటీ, తమ అంతర్గత ఆర్ అండ్ డి, ప్రొడక్ట్ డెవలప్మెంట్ ఇలా అనేక మూలాల నుంచి నీయట్ సేకరిస్తుందన్నారు. అధునాతన టెక్నాలజీలలో ప్రాక్టికల్ స్కిల్స్ పెంపొందేలా ఫ్యాకల్టీకి శిక్షణ ఇవ్వడం కూడా నీయట్ మోడల్‌లో మరో ముఖ్యమైన అంశమన్నారు. వారికి కూడా ఇండస్ట్రీలో ప్రస్తుతం ఉన్న టెక్నాలజీలపై పట్టు సాధించే విధంగా ప్రాక్టికల్ ట్రైనింగ్, ల్యాబ్స్, హ్యాండ్స్-ఆన్ కోడింగ్ సెషన్స్‌తో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అజింక్య డివై పాటిల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ రాకేష్ కుమార్ జైన్, యనపోయా డీమ్డ్ యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ ఫర్హాద్ యనపోయా, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఫౌండర్, వీసీ డాక్టర్ సిహెచ్.వి. పురుషోత్తం రెడ్డి, అరోరా డీమ్డ్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ శ్రీలత చేపూరి తదితరులు పాల్గొన్నారు.

వంటతో నిరసన మంట

■ వేణుగోపాల్ కాలనీలో నిరాశ్రయుల వంటావార్పు కార్యక్రమం

■ పోరాటపటిమతో మొండి గోడల మధ్యనే పోరాటం ■ విచారణ వేగవంతం చేస్తేనే బాధితులకు న్యాయం

కూల్చిన శిథిలాల మధ్య కూడు తినే వ్యధ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధి వేణుగోపాల్ కాలనీలో ఇళ్ల కూల్చివేతతో నిరాశ్రయులైన పేద, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీలు పోరాట పటిమతో మొండి గోడల మధ్యనే తమ పోరాటాన్ని కొనసాగిస్తూ విచారణ వేగవంతం చేసి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ దీక్షబూనారు. వేణుగోపాల్ కాలనీ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించి తమ నిరసనను తెలియజేశారు. ఇద్దరి మధ్య స్థల వివాదం తమ వద్ద దాచి ఉంచి మాయమాటలు చెప్పి తక్కువ ధరకే ప్లాట్లు వస్తాయని నమ్మబలికి లక్షలు తీసుకొని ఈ వివాద స్థలంలో తమని విడిచిపెట్టి నేడు కుటుంబాలతో రోడ్డున పడేలా చేశారని, మాకు న్యాయం జరుగుతుందా అని ఆశతో అధికారుల వైపు ఇక్కడి నిరాశ్రయులు చూస్తున్న పరిస్థితి. లక్షలు రూపాయలు పోగేసి ఇంటికి అవసరమైన వస్తువులను సమకూర్చుకొని కాపురం ఉన్న వారు తమ ఇంటిని చూసి కన్నీరు కారుస్తూ ఆదివారం నిర్వహించిన వంటావార్పు కార్యక్రమం వద్ద తోటి నిరాశ్రయులతో చెప్పుకుంటున్న పరిస్థితులు కనిపించాయి. గత సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఘటనను, భయానక వాతావరణాన్ని గుర్తుచేసుకొని మొండి గోడల మధ్యనే భోజనం చేశారు. ఈ వంటావార్పు కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.సుబ్రహ్మణ్యం, సిపిఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, సిపిఎం నాయకురాలు బుజ్జి, మాధవ్, వేణుగోపాల్ కాలనీ నిరాశ్రయులు శ్రీరామ్ నాయక్, సురేష్, రిషి తదితరులు పాల్గొన్నారు.

కేసు దర్యాప్తు వేగవంతం చేయాలి..

మంగళం పరిధి తిరుమల నగర్ పంచాయతీ పరిధిలోని చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖల సర్వే నెంబర్ 218/1 లోని ఒక ఎకరా 64 సెంట్లు భూమిలో ఏర్పాటు చేయబడ్డ వేణుగోపాల్ కాలనీని రాత్రికి రాత్రి ఇళ్లను ధ్వంసం చేయబడ్డ కేసులో పోలీసు ఉన్నతాధికారులు దర్యాప్తును వేగవంతం చేయాలని వేణుగోపాల్ కాలనీ నిరాశ్రయులు విజ్ఞప్తి చేశారు. స్థల వివాదం ఉంటే ముందస్తుగా ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, రాత్రికి రాత్రి వందల మంది యువకులను కాలనీపై పంపి జెసిబి యంత్రాలతో లక్షలు పోసి నిర్మించుకున్న ఇళ్లను గంటపాటులో నెల కూల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వెనుక ఉన్న కుట్రదారులను పోలీసు అధికారులు గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకొని బాధ్యులమైన తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ద్వార బంధనాలతోనే..

ఆదివారం నిర్వహించిన వంటావార్పు నిరసన కార్యక్రమంలో భాగంగా వంట వండుకోవడానికి దౌర్జన్యంగా కూల్చబడిన ఇళ్లకు అమర్చిన ద్వార బంధనాలను వంటకు వినియోగించుకునేలా చేశారని వేణుగోపాల్ కాలనీ నిరాశ్రయులు ఆవేదనతో మాట్లాడారు. వేల రూపాయలు వెచ్చించి ఇళ్లకు పటిష్టమైన ద్వార బంధనాలను ఏర్పాటు చేసుకున్నామని, ఓ క్రూర చర్యతో నేడు తమ ఇళ్లకు అమర్చిన వస్తువులనే వండుకునేలా చేశారని బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిలువ నీడ లేక..

వేణుగోపాల్ కాలనీ ఇల్లు ధ్వంసమైన తరువాత నిలువ నీడలేక ఎక్కడ ఉండాలో తెలియక ఇక్కడ నిరాశ్రయులు తల్లడిల్లి పోతున్నారు. తన ప్లాట్లు నిర్మించుకున్న ఇల్లులు కూల్చేయడంతో కూల్చివేయబడ్డ రాళ్ళను పోగేసి గోడలుగా రాళ్లను పేర్చి, పైకప్పుకు ఇళ్ల ధ్వంసంలో విరిగిన రేకులను ఏర్పాటు చేసుకొని ఓ వృద్ధుడు అందులోనే నిద్రిస్తున్న పరిస్థితిని ప్రజాశక్తి గుర్తించింది. ఆ వృద్ధుడు తాను ఏర్పాటు చేసుకున్న ఆ చిన్నపాటి గూడు ముందు వంట చేసుకుని అక్కడే సేద దీరుతున్నారు. ఇటువంటి పరిస్థితుల నడుమ బ్రతుకీడుస్తున్న వేణుగోపాల్ కాలనీలో ఉండే పేద, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కడుపు మంట

నిలువ నీడ చెదిరె.. కడకు గూడు మిగిలె

మెహర్ సేవలు అజరామరం

మెహర్‌కు నివాళి అర్పిస్తున్న శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సీనియర్ పాత్రికేయులు మెహర్ కుమార్ పాత్రికేయ రంగానికి చేసిన సేవలు అజరామరమని శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముత్యాలు వేణుగోపాల్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో అకాల మరణం పొందిన మెహర్ కుమార్ కు ఆదివారం సంతాప సభను ఏర్పాటు చేశారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం మీడియా రంగానికి, సమాజానికి మెహర్ చేసిన సేవలను వక్తలు గుర్తు చేశారు. వృత్తినే పరమావధిగా భావించి అంకితభావంతో పని చేసిన మెహర్‌ను కోల్పోవడం ప్రెస్ క్లబ్ కుటుంబానికి తీరని లోటని వాపోయారు. అనంతరం మెహర్ కుటుంబానికి శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ తరపున రూ. 27500 ఆర్థిక సాహాయమందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కార్తీక్ నాయుడు, గౌరవాధ్యక్షులు చంద్రయ్య, ఉపాధ్యక్షులు జయశ్యామ్, వెంకటేష్, రఫీ, పీఆర్వో ఈశ్వర్, ఏపీఆర్వో చంద్రశేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శి ధనశేఖర్, సీనియర్ పాత్రికేయులు ఈశ్వరయ్య, వాటంబేటి రవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెహర్ కుటుంబానికి ఆర్థిక సాయం

సీనియర్ పాత్రికేయుడు మెహర్ కుమార్ కుటుంబానికి, టిడిపి నాయకులు, మీడియా కోఆర్డినేటర్ నాగమల్లి దుర్గాప్రసాద్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నిబద్ధత కలిగిన పాత్రికేయుడిని పోగొట్టుకున్నందుకు బాధగా ఉందన్నారు. మెహర్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగమల్లి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రవిరాజుకు ఎన్టీఆర్ అవార్డు

డాక్టర్ రవిరాజుకు ఎన్టీఆర్ అవార్డు ఇస్తున్న నటుడు రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డాక్టర్ రవి రాజు చేసిన సేవలను గుర్తించి సాహిత్య సాంస్కృతిక సేవ ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలలో భాగంగా విజయవాడలో ఎన్టీఆర్ అవార్డు గ్రహీతగా ఎంపిక చేశారు. ఆయన తొలుత కార్వేటినగరం పిహెచ్‌సిలో డాక్టర్‌గా చేరారు. శరీరం మీద పుండ్లతో ఒకరి వెంట ఒకరు గ్రామాల నుంచి ఆసుపత్రికి రావడంతో ఆశ్చర్య పోయిన ఆయన, గ్రామాలకు వెళ్లి ప్రతి ఇల్లు తిరిగి, ఈ వ్యాధికి మూలం చనిపోయిన పశువులను మాంసాన్ని తినడం వల్ల వచ్చిందని గుర్తించి, ఇది ఆంత్రాక్స్ వ్యాధి అని వెలుగులోకి తీసుకొచ్చారు. జిల్లా యంత్రాంగం కదిలి వచ్చి వ్యాధిని అదుపులోకి తీసుకొచ్చారు. తిరుపతి ఏఐఎంఏలో పలు కీలక బాధ్యతలు వహించి, కరోనా సమయంలో జిల్లా అధికారులతో కలిసి చురుకైన పాత్ర పోషించారు. ఆయన పుత్తూరు వాకర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా ఎన్నికై అంచలంచలుగా ఎదిగి నేడు ఇంటర్నేషనల్ అసోసియేషన్‌కు ఎలెక్ట్ అధ్యక్షుడిగా అయినారు. 2026 కు పూర్తిస్థాయి ఇంటర్నేషనల్ అధ్యక్షుడుగా పనిచేయనున్నారు. కుటుంబ పరంగా ఆయన వైద్య సేవలను దగ్గర నుంచి చూసిన ఇద్దరు కుమార్తెలు డాక్టర్లుగా వైద్యరంగంలోకి ప్రవేశించడం విశేషం.

ప్రమాదాల నివారణకు చిరు వ్యాపారులు సహకరించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : రోడ్డు యాక్సిడెంట్ నివారించాలంటే చిరువ్యాపారస్తులు సహకరించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు కోరారు. తిరుపతి అన్నారావు సర్కిల్ వద్ద ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న చిరు వ్యాపారస్తులను ట్రాఫిక్ పోలీసులు డ్రోన్‌తో గుర్తించారు. అక్కడికి చేరుకుని రోడ్లు విశాలంగా ఉంటే యాక్సిడెంట్‌లు జరగవని వ్యాపారులకు సూచించారు. యాక్సిడెంట్ నివారణలో చిరు వ్యాపారస్తులు కూడా భాగస్వాములు కావాలని ట్రాఫిక్ సిబ్బంది సూచించారు. మొదటి తప్పిదంగా వారిని మందలించారు. ఎన్నోసార్లు చెబుతున్నప్పటికీ చిరు వ్యాపారస్తులు నిర్లక్ష్యంగా ఉండడం తగదన్నారు. రోడ్డు అక్రమించి వ్యాపారం నిర్వహిస్తున్న వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్‌వీఎస్ ప్రధానోపాధ్యాయులుగా తీగల వెంకటయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా తీగల వెంకటయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిపురం మండలం శెట్టిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాళహస్తి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరణ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎంఈఓ బాలయ్య, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, పలువురు ఉపాధ్యాయులు వెంకటయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి రామచంద్రపురం మండలం పరమాలకు బదిలీ అయ్యారు.

4న వెన్నుపోటు దినోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఎమ్మెల్సీ మేరీగమురళి కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వెన్నుపోటు దినోత్సవ కరపత్రాలను ఎమ్మెల్సీ మేరీగ మురళి, వైసీపీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరీగ మురళి మాట్లాడుతూ జూన్ 4వ తేదీకి టిడిపి ప్రభుత్వం వచ్చి సంవత్సరం కావస్తున్నా ఇప్పటికీ ఏ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఎప్పటిలాగే ఇచ్చిన హామీల నెరవేర్చకుండా టిడిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని, దీన్ని వ్యతిరేకిస్తూ వెన్నుపోటు దినోత్సవం జరుగుతుందని తెలిపారు. గూడూరు టవర్ క్లాక్ సెంటర్ నుండి ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు. నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చేవూరు విజయ మోహన్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, సునీల్ రెడ్డి గురవయ్య సంపత్ కుమార్ రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తిప్పారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నారాయణ గౌడ్

ప్రజాశక్తి - క్యాంపస్ : డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల అధినేత డాక్టర్ తిప్పారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ జ్ఞాపికతో సత్కరించారు. నారాయణ గౌడ్ మాట్లాడుతూ నిత్యం చిరునవ్వుతో పలకరించే మంచి మనసున్న పేద విద్యార్థుల పక్షపాతి ఎంతోమంది న్యాయమూర్తులు న్యాయవాదులను తయారుచేసిన గొప్ప విద్యా ప్రదాత తిప్పారెడ్డి అని కొనియాడారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించే విధంగా ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవారి ఆశీస్సులు ఆయనకు మెండుగా ఉండాలని మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరారు.

సమస్యల జంక్షన్.. పుత్తూరు రైల్వే స్టేషన్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారిగా రేణిగుంట నుండి పుత్తూరు వరకు రైలు నడిపిన చరిత్ర పుత్తూరు రైల్వే స్టేషన్‌కు ఉంది. ఈ స్టేషన్‌లో మీటర్ గేజ్, బ్రాడ్ గేజ్ రైల్వే లైన్లు రెండింటిపై గతంలో రైలు బండ్లు నడిచేవి. కాలక్రమేణా బ్రాడ్ గేజ్ మాత్రమే వినియోగంలో ఉంది. గత వైభవం పక్కన పెడితే నేడు సౌకర్యాల లేమితో స్టేషన్ అట్టడుగున ఉంది. అభివృద్ధికి నోచుకోక ప్రయాణీకులకు అవస్థలను మిగులుస్తోంది. ప్రధాని మోడీ ప్రారంభించిన అమృత్ రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా పుత్తూరు రైల్వే స్టేషన్‌కూడా చేర్చాలని నగర వాసులు కోరుతున్నారు. పుత్తూరు పట్టణం ఈశలాపురం కట్టుకు, మామిడి పండ్లుకు, విద్యా సంస్థలకు ప్రసిద్ధి చెంది నగర జనాభా అంతకంతకూ పెరుగుతోంది. వారి అవసరాలను తీర్చే విధంగా స్టేషన్‌ను తీర్చి దిద్దాలని ప్రయాణీకులు కోరుతున్నారు. ఒకటో ఫ్లాట్ ఫామ్‌నుండి రెండవ ప్యాట్‌ఫామ్‌కు వెళ్లాలంటే ఎండ, వానల్లోనే వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఎప్పుడో పాతకాలంలో నిర్మించిన ఇరుకు వంతెన మీటర్ గేజ్ నుండి బ్రాడ్ గేజ్ లైన్లకు వెళ్లాలంటే ఉపయోగపడుతోంది. పుత్తూరు రైల్వే స్టేషన్‌కు దాదాపు రోజుకు 1500 మంది ప్రయాణీకుల తాకిడి ఉంటుంది. ఒక టికెట్ కౌంటర్ ద్వారా వచ్చి పోయే రైళ్లకు తమిళ్, తెలుగు భాష తెలియని బుకింగ్ క్లర్కు ప్రయాణికులు చెప్పే ఊర్లకు టికెట్లు ఇవ్వకుండా కర్నూలుకు టికెట్ అడిగితే కన్యాకుమారి, వెంకటగిరికి టికెట్ అడిగితే వేపగుంటుకు టికెట్ ఇచ్చిన సందర్భాలున్నాయి. స్థానిక భాష తెలిసిన క్లర్క్‌ను వేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు. పుత్తూరు మెయిన్ రోడ్ రైల్వే మురుగన్ దేవాలయం వద్ద ఉత్సవాల సందర్భంలో ప్రయాణికులు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. సకాలంలో వెళ్లలేక ట్రాఫిక్ సమస్యతో ప్రయాణీకులు రైల్లు మిస్సవుతున్నారు. ప్రయాణికుల కోసం ఏర్పాటుచేసిన మరుగుదొడ్లకు ఎప్పుడూ తాళం వేయడంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. పుత్తూరులో ఆగే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్, లేడీస్, హ్యాండిక్యాప్డ్ బోగీలు రైలు బండి చివరన ఉండటంతో దిగిన వృద్ధులు, దివ్యాంగులు 1 ఫ్లాట్ ఫామ్ చివరి నుండి ముందుకు రావాలంటే ఎండకు, వానకు తడిసి పోవాల్సిన పరిస్థితి. ఈశలాపురం గ్రామానికి వైద్యానికి వస్తున్న కొంతమంది కాళ్లు, నడుము విరిగిన వాళ్లు ఈ ప్లాట్ ఫామ్‌లతో బాధ పడుతున్నారు. గతంలో ఏం బి రోడ్డు నుండి దారి సౌకర్యం ఉండేది, రైల్వే స్టేషన్ ఎదురుగా మార్కెట్ ద్వారం ఉండేది అది కూడా మూసివేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఫాట్‌ఫామ్ నాశిరకంగా నిర్మాణం చేయడంతో ఎక్కడ చూసినా పగుళుఏర్పడి ఉన్నాయని మరమ్మతుల చేయించాలని కోరుతున్నారు.



ఈ వసతులు ఏర్పాటు చేయండి..!

1) ఫుట్ ఓవర్ బ్రిడ్జిని వెడల్పు చేసి ఎండకు వానకు పై కప్పు నిర్మించాలి.
2) లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయాలి.
3) ప్రయాణికులు దిగిన వెంటనే ప్లాట్‌ఫామ్ చివరన షెల్టర్, చక్రాల కుర్చీ ఏర్పాటు చేయాలి.
4) ఎంబి రోడ్డు వద్ద దారి సౌకర్యం కల్పించాలి.
5) మూయబడిన మార్కెట్ దగ్గర ఉన్న దారిని పునః ప్రారంభించాలి.
6) పే అండ్ యూస్ టాయిలెట్లు వాడుకంలోకి తేవాలి.
7) గేట్ పుత్తూరు ఎంబి రోడ్డు కలుపుతూ ఫుట్ ఓవర్ బ్రిడ్జి, లిఫ్టు ఏర్పాటు ఏర్పాటు చేయాలి.
8) ఫాట్‌పామ్ పగుళ్లకు మరమ్మతులు చేయించాలి.

చౌక దుకాణాలతోనే మెరుగైన సేవలు

రేషన్ దుకాణం ప్రారంభించిన నాయుడుపేట తహసీల్దార్ రాజేంద్ర

ప్రజాశక్తి - నాయుడుపేట: రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి రేషన్ షాపులను ప్రారంభించదలచిన విషయం అందరికి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాయుడుపేట మున్సిపాలిటీలోని ఎన్ఎస్ఆర్ కాలనీలో రేషన్ షాపును తహసీల్దార్ ఎం.రాజేంద్ర ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు నెలలో 15 రోజుల్లో తమ వీలును బట్టి రేషన్ తీసుకోవచ్చని అన్నారు. రేషన్ డీలర్లు కొలతల్లో అక్రమాలకు పాల్పడకుండా పంపిణీ చేయాలని సూచించారు. తహసిల్దార్ వెంట సివిల్ సప్లైస్ గోడౌన్ డిటి పెళ్లూరు గోపీనాథ్ రెడ్డి, వీఆర్వో బాబు, రేషన్ షాప్ డీలర్లు మొండెం వెంకయ్య, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం : రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి చౌక దుకాణాల ద్వారా మెరుగైన సేవలతో కూడిన నిత్యవసర వస్తువుల పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బలిజపల్లి ప్రసన్న వెంకటేశ్వరపురం గ్రామంలో ఆదివారం చౌక దుకాణాల ద్వారా నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సి జనార్దన్ చౌదరి, పసుపులేటి విజయ్ కుమార్, కె త్యాగరాజులు, సుగుణమ్మ, నరసింహారెడ్డి, రాజేష్ రెడ్డి, మల్లిరెడ్డి, వెంకటరమణారెడ్డి, ఏ భూపతి రెడ్డి, బి నాగూర్ రెడ్డి, వీఆర్వో గుణ భూషణ్ నాయుడు, స్థానిక కూటమి పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సి రామాపురంలో .. మండలంలోని చుట్టుగుంట రామాపురం గ్రామంలో తిరుపతి ఆర్ డి ఓ రామ్మోహన్ చౌకు దుకాణంలో నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖలో ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన రేషన్ పంపిణీ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డీలర్లను ఆదేశించాడు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పేద ప్రజలకు ఇకపై రేషన్ షాపుల ద్వారా నాణ్యమైన నిత్యావసర సరుకులను పంపిణీ చేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారుజ ఆదివారం ఉదయం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిచ్చాటూరు, సత్యవేడు మండలాలలో పర్యటించి రేషన్ షాపులను ప్రారంభించి లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పిచ్చాటూరు మండలం రామగిరి షాప్ నెం.3 కి చేరుకొని ఎమ్మెల్యే చేరుకొని, తహశీల్దారు టీవీ సుబ్రమణ్యం తో కలిసి రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. అనంతరం సత్యవేడు మండలం దాసుకుప్పంలో చౌక దుకాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు టీవీ సుబ్రమణ్యం, ఆర్ ఐ సుధాకర్, ఏఎంసి మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, పద్దు రాజు ఆయకట్టు చైర్మన్ రవి, వాసు రెడ్డి ఢిల్లీ బాబు అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని 28 పంచాయతీల చౌక దుకాణాల ద్వారా ఆదివారం ఖచ్చితమైన తూకంతో నాణ్యమైన సరుకులు అందించాలని తహశీల్దార్ శ్రీదేవి డీలర్లకు సూచించారు. తూనికలలో తేడాలుంటే లబ్ధిదారులు తహశీల్దార్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ఏ షాపులో అయినా అవకతవకలు జరిగినట్లు తెలిస్తే డీలర్ మీద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే సరుకులు పంపిణీచేయాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా రేషన్ డీలర్లు ఆదివారం నిత్యావసర సరుకులు లబ్దిదారులకు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర ప్రభుత్వం చౌక బియ్యం సరపరాన్ని తిరిగి రేషన్ డీలర్లకు అప్పజెప్పడం రేషన్ వ్యవస్థకు మహర్దశ లాంటిదని ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 32వ వార్డులో టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్ నాయుడుతో కలిసి ఆర్డీవో రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి తేదీ 15 తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు పనిచేయాలని సూచించారు. వృద్ధులు, వికలాంగుల ఇంటికి రేషన్ చేరుతుందని తెలిపారు. వార్డ్ కార్యదర్శి సఫీ పాల్గొన్నారు. తొట్టంబేడు మండలంలోని గుండేలిగుంటలో గాలి మురళి నాయుడు, బసవయ్యపాలెంలో రావిళ్ళ రాజానాయుడు, పెద్దకన్నలిలో ప్రతాప్ రెడ్డి రేషన్ దుకాణాలు ప్రారంభించారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని సొసైటీ సెంటర్, ఐసిఎస్ రోడ్డు, రెండో పట్టణంలో పలు ప్రాంతాల్లో రేషన్ షాపులను ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ప్రజలకు నిత్యవసర రేషన్ బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చదలవాడ హరిబాబు, శీలం కిరణ్ కుమార్, మస్తాన్ నాయుడు, కుమార్, పేటేటి చంద్రనీల్, శ్రీనివాసులు, వెంకు తదితరులు పాల్గొన్నారు. గూడూరు మండల పరిధిలోని చెన్నూరులో షాపు నెంబర్ 31,32,33,34,64లో విఆర్వో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మట్టం శ్రావణి రెడ్డి చేతుల మీదుగా రేషన్ పంపిణీ కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు యరమాపు.హేమకుమార్ రెడ్డి, ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి,అల్లం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దొరవారిసత్రం : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇకపై రేషన్ సరుకులు రేషన్ డీలర్ల షాపుల వద్దే ఇస్తారని మండల తహశీల్దార్ శైలాకుమారి తెలిపారు. ఆదివారం ధొరవారిసత్రం మండలం, చవట కండ్రిగ షాప్ నెంబర్ 14 లో రేషన్ ఈ–పాస్ మిషన్ పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమములో ముఖ్య అతిథిగా తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, ఆర్ఐ ప్రవీణ్ రాయల్, వీఆర్వో సుబ్రమణ్యం, సింగనాల్తూరు సర్పంచ్ దార్ల మణి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని పాత డీలర్ షాపులు ఆదివారం పునః ప్రారంభం అయ్యాయి. ఇందులో భాగంగా పలుచోట్ల మండల రెవెన్యూ అధికారి ద్వారకానాథ్ రెడ్డి, తెలుగుదేశం మండల నాయకులు రేషన్ షాపులు ప్రారంభించారు. తాల్వాయి పాడులో షాపు ప్రారంభనాంతరం ఎమ్మార్వో ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రజలకు సరుకులు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ డి సి గోపినాథ్ రెడ్డి, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి తిరుమల రావు, టిడిపి నాయకులు జి రామకృష్ణ, జి శ్రీనివాసులు, చలపతి, బాలయ్య మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మహానాడు సక్సెస్‌తో మాజీ ఎంపీ నెలవలకు అభినందనలు

ప్రజాశక్తి - నాయుడుపేట: కడపలో మే 27,28, 29వ తేదీ లలో జరిగిన టీడీపీ మహానాడు కార్యక్రమం విజయవంతం చేయడంలో తన వంతు పాత్ర పోషించిన మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం కు తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అభినందనలు తెలియజేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ సహకారంతో వేలాది మందిని తరలించి మహానాడు విజయవంతానికి కృషి చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం నెలవల సుబ్రహ్మణ్యం నాయుడుపేట మునిసిపాలిటీలోని తుమ్మూరు 25వ వార్డులో రేషన్ షాపు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పేరంశెట్టి.శ్రీరామ్ ప్రసాద్, పెళ్లకూరు మండల పార్టీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య,ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసల గంగాప్రసాద్, పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ నానబాల సుబ్బారావు, టిడిపి జిల్లా కార్యదర్శి బిరదవాడ నారాయణ, నాయుడుపేట మండలం టిడిపి కార్యదర్శి మల్లం రవికుమార్,తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు అవధానం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా న్యాయవాది సురేష్ రాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రముఖ క్రిమినల్ న్యాయవాది సురేష్ రాజు జన్మదిన వేడుకలను ఆదివారం తిరుపతి రూయా హాస్పిటల్ వద్ద ఘనంగా నిర్వహించారు. మంగళంకు చెందిన సతీష్, అశోక్, నాని, వినోద్, నవీన్, సందీప్, ప్రశాంత్, నిక్కీ అలా ఆధ్వర్యంలో రూయా హాస్పిటల్ వద్ద 500 మందికి అన్నదానం చేశారు.

గ్రేడ్ 2 హెడ్మాస్టర్లుగా నలుగురికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మున్సిపల్ కార్పొరేషన్‌లోని హైస్కూళ్ళకు 30వ తారీకు జరిగిన పదోన్నతుల ప్రక్రియలో భాగంగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాలుగు పాఠశాలలకు గ్రేడ్ 2 హెడ్మాస్టర్లుగా పదోన్నతి పొందివారు ఆదివారం నూతన పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతి పొందిన వారిలో మురుగన్, రవిచంద్రన్, పరంజ్యోతి, పరంధామనాయుడులను పాఠశాలల ఉపాధ్యాయులు, యుటిఎఫ్, ఎస్‌టియు, ఏంటీఎఫ్ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బండి మధుసూదన రెడ్డి, ఎద్దల హేమాద్రి బాబు, పసపల గోపాల్, ఎస్టియు నాయకులు, ధనంజయులు నాయుడు, పి రేణుకాదేవి, యం టి ఎఫ్ నాయకులు కదిరి రవి, మురళీమోహన్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత విశ్వవిద్యాలయంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత విశ్వవిద్యాలయాల సంఘం, విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు, ఫిట్‌నెస్, స్థిరత్వం, సమాజ స్ఫూర్తిని ప్రోత్సహించడానికి విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఆదివారం ఉదయం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని సైకిల్‌పై ఆదివారాల ప్రత్యేక ఎడిషన్‌తో జరుపుకుంది. వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి నేతృత్వంలో విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఫిట్ ఇండియా ప్రతిజ్ఞతో కార్యక్రమం నిర్వహించారు. క్యాంపస్‌లో రెండు ల్యాప్‌లలో 2 కి.మీ. దూరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్రీడల కార్యదర్శి సేతురాం యూనిట్ 4 సహకారంతో నాయకత్వం వహించారు. 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు ఇండియన్ యూనివర్సిటీస్ అసోసియేషన్, జాయింట్ సెక్రటరీ, ప్రపంచ సైకిల్ దినోత్సవ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బల్జిత్ సింగ్ షెకాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వెన్నుపోటు దినం నాటకం ఎవరి కోసం?

ప్రజాశక్తి - క్యాంపస్ : జూన్ 4వ తేదీన వైసీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం ఎవరికోసమని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టె హేమంత్ రాయల్ ప్రశ్నించారు. జగన్ సొంత బాబాయికి, చెల్లెలికి, తల్లికి చేసింది వెన్నుపోటని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి ప్రణాళికలతో ముందుకెళుతుంటే ఓర్వలేక ఈ నాటకాలాడుతున్నారని మండి పడ్డారు. ఎన్నికల్లో ఘోర పరాజయాలు చేసిన వారు నాటకాలు తెరలేపారన్నారు. ఇకనైనా వైసీపీ నాయకులు వంకర బుద్ధిని మార్చుకోవాలని, లేదంటే రానున్న పంచాయతీ, కార్పొరేషన్ ఎన్నికలలో ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

నీలం సంజీవరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో భారత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డి 29 వర్ధంతి సందర్భంగా వర్సిటీ అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు. ఇంచార్జీ విసి ఆచార్య అప్పారావు ప్రాంగణంలోని నీలం విగ్రహానికి పూలమాల వేసి ఆయన కీర్తిని కొనియాడారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ నీలం రాష్ట్రపతిగానే కాక, యస్వీయూ వృద్ధి వెనుక మార్గదర్శక శక్తిగా కూడా గుర్తుండిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వెంకటేశ్వరు సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF ADDITIONAL SUBORDINATE JUDGE AT PONNERI
M.C.O.P NO: 452 OF 2023

Hariharan ...Petitioner

-VS-

1. Paapana Boina Srinivasulu,
2. The United India Insurance Co. Ltd.,

...Respondents

To:-
R1: Paapana Boina Srinivasulu S/o. Papana Boina Siddaiah, B.V. Nagar, Nellore, Nellore Rural, SPS Nellore, Andhra Pradesh - 524004. ...For 1st Respondent

PAPER PUBLICATION

Please take notice that the above M.C.O.P No. 452 / 2023 has been posted for your appearance on 17.06.2025 before the Additional Sub Court at Ponneri. Hence you are requested to appear before the Hon'ble court on 17.06.2025 at about 10.30 A.M. failing which you will be set exparte and the case will be decided on merits.

Hg: 17.06.2025

MSLR ASSOCIATION
G.LOGU, M.A., B.L.,
N.REEJITH
S.SUTHISH
Counsel for Petitioner

క్రైం న్యూస్

తెలుగు గంగ కాలవలో మృత దేహం

మధు మృత దేహం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని తెలుగు గంగ కాలువలో ఆదివారం ఉదయం ఒక మృత దేహం కొట్టుకు రావడంతో, చెంచులక్ష్మీ కాలనీ దగ్గర గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాధ నాయుడు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మృతుడు మధు బెంగుళూరుకు చెందిన వాడని, వివాహమైందని ఇంకా పిల్లలు లేరని తెలిపారు. భార్య, భర్తలు ఇద్దరు అంజూరు గ్రామంలోని మధు అక్క, బావల వద్దకు వస్తుండేవారని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని కొందరు యువకులతో కలిసి మధు తెలుగు గంగ కాలవలో ఈతకు వెళ్లాడని, నీటి ప్రవాహం ఒక్కసారిగా ఎక్కువగా రావడంతో ఈత రాక కొట్టుకుపోయాడని తెలిపారు. చెంచులక్ష్మి కాలనీ వద్ద మృత దేహంగా తేలాడని తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఎరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మృతి చెందిన రామేశ్వర్ రెడ్డి (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం తిరుపతి నగరంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్‌లో తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన రామేశ్వర్ రెడ్డి(32) భార్యతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మృతుడి భార్య మహిత తండ్రి తిరుపతికి రావడంతో మద్యం మత్తులో అర్ధరాత్రి గొడవ జరిగింది. గొడవతో విసిగిపోయిన స్థానికులు, నచ్చజెప్పడంతో మహిత ఇంటిలోకి వెళ్లి గడి వేసుకొంది. ఎంతకీ తలుపులు తీయకపోవడంతో భర్త గట్టిగా కేకలు వేశాడు. తలుపులు తీయకపోతే ఉరి వేసుకుని చస్తానంటూ బెదిరించాడు. అయినా భార్య మహిత తలుపులు తీయకుండా భర్త ఆత్మహత్య చేసుకుంటానని భయపెడుతున్నట్లు మృతుడు స్నేహితులకు అతడు భార్య సమాచారం అందించింది. స్నేహితులు వచ్చి చూసే లేపే బయట గదిలో రామేశ్వర్ రెడ్డి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని యువకుడు హత్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఎగువ వీరా రెడ్డి పల్లి సమీపంలో, ఓ ప్రైవేట్ లే అవుట్ వద్ద గుర్తు తెలియని యువకుడు హత్యకు గురైన సంఘటన చోటు చేసుకుంది. మృత దేహాన్ని గూడూరు డి.ఎస్పీ గీతా కుమారి, గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్‌లు కలిసి సంఘటన స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డి.ఎస్పీ గీతా కుమారి మాట్లాడుతూ మృతుడు ముఖం పై పదునైన ఆయుధంతో దాడి చేయడం వలన మృతి చెందాడన్నారు. మృతుడు వయస్సు సుమారు 35 నుండి 40 సంవత్సరాలు మధ్యలో ఉంటుందన్నారు. మృతుడు కుడి చేతిపై అశోక్ అని హిందీలో, ఎడమ చేతిపై తేలు బొమ్మ పచ్చ బొట్లు ఉన్నాయని తెలిపారు. ఎవరైనా మృత దేహాన్ని గుర్తించిన వెంటనే గూడూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృత దేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

లారీ, బైకు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి

మృతి చెందిన పగడాల చిరంజీవి

ప్రజాశక్తి - నాయుడుపేట: కంటైనర్ ఢీకొని బైక్‌పై వెళుతున్న ఒక యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం నాయుడుపేట మండలం, మేనకూరు సెజ్ పరిదిలోని హిందుస్థాన్ గ్లాస్ కంపెనీ పక్కన చోటు చేసుకుంది. ఓజిలి మండలం గద్దగుంట గ్రామానికి చెందిన పగడాల చిరంజీవి (21) మేనకూరు సెజ్ పరిధిలో టీవీఎస్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. రోజు లాగానే ఆదివారం ఉదయం డ్యూటీ కోసమని తన ఇంటి నుంచి బైక్‌పై టీవీఎస్ కంపెనీకి బయలుదేరి వెళుతున్న యువకుడిని అదే సెజ్‌లోని హిందుస్థాన్ గ్లాస్ కంపెనీకి వెళ్లవలసిన కంటైనర్ అడ్రస్ మరిచి హిందుస్థాన్ కంపెనీని దాటి ముందుకు మలుపు తిరుగుతున్న సమయంలో మృతుని ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. శనివారం రాత్రి కంపెనీలో డ్యూటీ చేసి తెల్లవారుజామున ఇంటికి వెళ్లి నిద్రిస్తున్న చిరంజీవిని కంపెనీకి మళ్లీ రావాలని యాజమాన్యం ఫోన్ చేయడంతో ఇంటి నుంచి కంపెనీకి తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కంటైనర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలియజేశారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాసుత్రికి తరలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాబి తెలియజేశారు.

మృతుని కుటుంబానికి సిఐటియు నాయకుల ప్రగాఢ సానుభూతి

టీవీఎస్ కంపెనీలో పనిచేసే కార్మికుడు యాక్సిడెంట్లో మరణించిన పగడాల చిరంజీవి మృతదేహాన్ని సందర్శించి సిఐటియు నాయకులు శివకవి ముకుంద నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఓజిలి మండలం, గ్రద్దగుంట గ్రామానికి చెందిన పగడాల రంగమ్మ, నాగరాజుల చిన్న కుమారుడు చిరంజీవి లారీ యాక్సిడెంట్లో మృతి చెందారని, కంపెనీ పరంగా చట్ట ప్రకారం రావలసినవన్నీ ఆ కుటుంబానికి నష్టపరిహారంగా అందజేయాలని లేనిపక్షంలో పోరాటాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లా, వేణు తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయము, గూడూరు
ఇ-ప్రొక్యూర్ రెండవ పిలుపు టెండరు ప్రకటన

టెండర్ నోటీసు: Roc.No. 437/2025/E1 తేది: 02.06.2025
IFB. No.01/E1/2025 (2nd Call)

గూడూరు పురపాలక సంఘం (తిరుపతి జిల్లా) పరిధిలో సాధారణ నిధులతో 1 పనికి రూ. 70.00 లక్షలతో Providing central lighting from Vinayaka swamy temple near RTC bus stand to Royal Enfield showroom in Gudur Municipality పనికి సంబంధించి టెండరు రెండవ పిలుపు తేది. 02.06.2025 ఉదయం. 10.30 గం॥ నుండి షెడ్యూలు ప్రారంభము మరియు బిడ్ స్వీకరించుటకు చివరి తేది. 16.06.2025 మ. 3.30 గం॥ వరకు, మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వివరాలకు www.apeprocurment.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు. ఫోన్ నెం. 9642256759

కమీషనరు
గూడూరు పురపాలక సంఘం